రేపు ఉద్యోగ మేళా


కొత్తగూడెం సంక్షేమం, న్యూస్‌టుడే: కొత్తగూడెంలో గురువారం జరిగే ఉద్యోగ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం తెలిపారు. క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, రిలయన్స్ జియో ఇన్ఫో కంపెనీల్లో ఖాళీగా ఉన్న 550 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి, పదోతరగతి నుంచి పీజీ విద్యార్హత గల నిరుద్యోగులు అర్హులని చెప్పారు. కొత్తగూడెం బాబుక్యాంపు, రామాలయం రోడ్ ఎదురుగా ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

రేపు, ఎల్లుండి గవర్నర్ పర్యటన



భద్రాచలం, న్యూస్‌టుడే: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పర్యటించనున్నారు. ఆ వివరాలను గవర్నర్ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం మంగళవారం వెల్లడించారు. గురువారం ఉదయం ఆయన సూర్యాపేటలో అధికారులతో సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటలకు బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ అతిథి గృహానికి చేరుకుని రాత్రి బస చేస్తారు. శుక్రవారం ఉదయం 8.10 గంటలకు భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుంటారు. 9 గంటలకు కొత్తగూడెం కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. రచనలు, కళలు, వివిధ రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న 25 మందిని కలుస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఖమ్మంలోని ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకుంటారు. భోజనం అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం రాష్ట్ర, జాతీయ అవార్డులు పొందిన 25 మందిని గవర్నర్ కలుస్తారు. సాయంత్రం 4 గంటలకు ఖమ్మం నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరి రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు.

ఆలయ స్థలం.. ఆదాయ మార్గం



దేవాదాయ శాఖ భూముల వివరాలు (ఎకరాల్లో)

	భద్రాద్రి	ఖమ్మం
మొత్తం భూమి	9,635.42	4,755.30
అర్చకుల ఆధ్వర్యంలో ఉన్నది	234.31	1,360.19
కౌలుకిచ్చింది	7,406.03	2,269.03
కబ్జాకు గురైంది	1,151.05	833.02
ఖాళీ స్థలాలు	844.03	293.06

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, ఖమ్మం సాంస్కృతికం

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని దేవుడి మాన్యాలు, ఆస్తుల పరిరక్షణకు దేవాదాయ, ధర్మాదాయశాఖ నడుం బిగించింది. ఆలయాల భూముల అన్యాక్రాంతాన్ని అడ్డుకునేందుకు ఆధునిక, సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తోంది. ఇందులో భాగంగా ఉభయ జిల్లాల్లోని అన్ని దేవాలయాలకు సంబంధించిన భూములకు గూగుల్ సహకారంతో జియో ట్యాగింగ్ పూర్తిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా లీజుకిచ్చిన దేవాలయ భూములు, దుకాణ సముదాయాల వివరాలు, వాటి ద్వారా సమకూరుతున్న ఆదాయం, లీజు, అద్దె బకాయిలను వీలైనంత త్వరగా రాబట్టాలని ఇటీవల దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధికార యంత్రాంగం ఆ దిశగా కసరత్తు చేస్తోంది.

225 ఆలయాలు.. 14,391 ఎకరాలు

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలోని 225 దేవాలయాల ఆధీనంలో సుమారు 14,391 ఎకరాల భూములున్నాయి. వీటిలో అత్యధికంగా 9,675 ఎకరాలు లీజు(కౌలు)కు ఇచ్చారు. వీటి ద్వారా ఏటా రూ.1.75 కోట్ల ఆదాయం సమకూరుతోందని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. 1,595 ఎకరాల భూమి అర్చకుల ఆధ్వర్యంలో ఉండగా.. 1,137 ఎకరాల భూములు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దేవాలయాల ఖాళీ స్థలాల్లో సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటుచేసి ఆదాయం సమకూర్చుకోవాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే.

కబ్జా కోరల్లో 1,984 ఎకరాలు

ఉభయ జిల్లాల్లో దేవాదాయశాఖకు చెందిన 1,984 ఎకరాల భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నట్లు అధికారులు గుర్తించారు. వీటికి సంబంధించి దేవాదాయశాఖ ట్రైబ్యునల్‌లో 39, హైకోర్టులో 35 కేసులు నడుస్తున్నాయంటున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో భూముల ధరలు భారీగా పెరిగాయి. ఎకరా భూమి రూ.లక్షల్లో పలుకుతోంది. అందుకే కబ్జాకేదీ అనర్హం కాదన్నట్లు ఆక్రమణదారుల కళ్లు ఖాళీ స్థలాలపై పడుతున్నాయి. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూముల్లో ఎక్కువ శాతం దేవాలయ భూములే ఉండటం గమనార్హం. ఇప్పటికే ఖమ్మం జిల్లా పరిధిలో 833, భద్రాద్రి జిల్లాలో 1,151ఎకరాల భూములు ఆక్రమణలో ఉన్నాయి. ఆలయ భూములకు రక్షణ కల్పించటం ప్రభుత్వ శాఖలకు సవాలుగా మారుతోంది.

ఆక్రమణలను అడ్డుపడనుందిలా..

దేవాలయ భూములకు జియో ట్యాగింగ్ చేయటం వల్ల ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుంది. స్థలం వివరాలు, సరిహద్దులు, దేవస్థానం పేరు, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. జియో ట్యాగింగ్ చేసిన ఆలయ భూములు, స్థలాల వివరాలను రిజిస్ట్రేషన్ శాఖకు అనుసంధానం చేస్తారు. తద్వారా అక్రమ రిజిస్ట్రేషన్లకు ఆస్కారముండదు. జియో ట్యాగింగ్ పూర్తిచేసిన ఆలయ భూముల వివరాలను ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తపరుస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దేవాదాయశాఖ భూములకు జియో ట్యాగింగ్‌తో పాటు జియో ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తే మరింత రక్షణ కల్పించవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వలపు వల.. చిక్కితే విలవిల

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే

అనుకోకుండా వాట్సప్ నుంచి వీడియో కాల్ వస్తుంది. ఏదైనా ముఖ్యమైన కాల్ ఏమో అని ఎత్తామా.. ఇక అంతే సంగతులు.. అవతల అందమైన స్త్రీ నగ్నంగా మాట్లాడుతుంది. ఆమె, ఇటుపక్క బాధితుడు స్క్రీన్‌మీద కనిపిస్తున్న వీడియోని రికార్డు చేస్తారు. ఇక బెదిరింపులు మొదలుపెడతారు. నగ్న వీడియోను కుటుంబ సభ్యులకు పంపుతామని, తెలిసినవారుండే గ్రూపుల్లో పెడతామని బెదిరించి రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు ఈ కొత్త దోపిడీకి తెర లేపారు. పోలీసులు ఒకపక్క అవగాహన కల్పిస్తుంటే.. కొత్త విధానాలతో నేరస్థులు తెగబడుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొత్తరకం సైబర్‌నేరాలు చోటుచేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.

లింకులు క్లిక్ చేస్తే ఊడ్చేస్తారు..!

ఉచిత డేటా, ఐఫోన్ అంటూ ఊరించే సందేశాలు ఇప్పుడు సర్వసాధారణమయ్యాయి. ఏమాత్రం ఆశపడి క్లిక్ చేసినా బ్యాంకులో దాచుకున్న సొమ్మునంతా ఊడ్చేస్తారు. ఎవరూ ఏదీ ఉచితంగా ఇవ్వరనే విషయాన్ని గ్రహించాలి. ప్రజల మానసిక బలహీనతలతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. 'ఆన్‌లైన్ ఉద్యోగం, ఇంటి వద్దే ఉంటూ నెలకు రూ.లక్షకుపైగా సంపాదించవచ్చు', 'రోజుల వ్యవధిలో పెట్టుబడి రెట్టింపవుతుంది' వంటి ప్రకటనలు ఊరిస్తున్నాయని, వీటిని నమ్మి మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



మోసాలు

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఈ ఏడాది జులై చివరి నాటికి 292 ఫిర్యాదులు అందాయి. వీటిలో రూ.1.41 కోట్లు పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్పందించిన సైబర్ నేరవిభాగం పోలీసులు రూ.25 లక్షలు నిందితులకు చేరకుండా బ్యాంక్‌లో హోల్డ్‌లో పెట్టించగలిగారు.

వాట్సాప్ వీడియో కాల్ ఎత్తకండి

గుర్తు తెలియని నంబర్ నుంచి వీడియో కాల్ వస్తే లిఫ్ట్ చేయవద్దు. ఒకవేళ ఎత్తాల్సి వస్తే ఫ్రంట్ కెమెరాను వేలితో మూసి లిఫ్ట్ చేయాలి. దీంతో మనం స్క్రీన్‌లో కనిపించం. వాళ్లు రికార్డు చేసే అవకాశం ఉండదు. ఎవరైనా మోసపోతే గంట వ్యవధిలో 1930కి కాల్ చేసి వివరాలు చెప్పాలి.

- ఫణీందర్, డీఎస్పీ, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, ఖమ్మం

ఇవిగో ఉదాహరణలు...

- అధిక లాభాలు వస్తాయన్న ఫేస్‌బుక్ ప్రకటన నమ్మి ఖమ్మంలోని పాండురంగాపురానికి చెందిన ఉపాధ్యాయుడు స్టాక్ మార్కెట్‌లో రూ.40లక్షలు పెట్టుబడి పెట్టారు. ఆనక మోసపోయానని గుర్తించి ఆగస్టు 13న సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో వచ్చిన లింకును క్లిక్ చేయటంతో పాటు వివరాలు నమోదు చేసిన నగరంలోని మధురానగర్‌లో నివసించే ఉపాధ్యాయుడు రూ.73 వేలు పోగొట్టుకున్నారు. సెప్టెంబరు 24న పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- తల్లాడలో అక్టోబరు 18న అర్ధరాత్రి ఇద్దరు నాయకులకు వాట్సప్ న్యూడ్ కాల్స్ వచ్చాయన్న వార్త కలకలం సృష్టించింది.
- ఖమ్మంలో ప్రముఖులు కొందరు అక్టోబరు నెల్లో ఇటువంటి కాల్స్‌ను ఎదుర్కొన్నారు.
- వైరాకు చెందిన ఓ వ్యక్తికి ఇటువంటి కాల్ చేసి వీడియో రికార్డు చేసిన నేరస్థులు దాన్ని ఆయనకు పంపించారు. నగదు చెల్లించాలంటూ బెదిరించారు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు.

'ఆటంకాలెదురైనా ఉద్యమాలు నిర్వహించాం'

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అనేక గ్రామాల్లో 1974లో కాలినడకన పర్యటించి మోటూరు ఉదయం, మల్లు స్వరాజ్యం సహకారంతో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం ఉమ్మడి రాష్ట్ర మొట్టమొదటి మహాసభను ఖమ్మంలోని వర్తకసంఘ భవనంలో నిర్వహించినట్లు నాడు ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పనిచేసిన ఏలూరు జయమ్మ తెలిపారు. ఐద్వా రాష్ట్ర నాలుగో మహాసభల్లో భాగంగా కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సభకు జయమ్మ హాజరై మాట్లాడారు. మహిళలు ఇంటి నుంచి బయటకు రావడానికి అనేక ఆటంకాలు ఎదురవుతున్న కాలంలోనే వారిని సమీకరించి కాలినడకన వెళ్లి ఉద్యమాలు చేశామన్నారు. మహిళా కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులకు హాజరై మానకొండ సూర్యావతి, భిక్షపతి తదితరులు బోధించిన విషయాలను స్ఫూర్తిగా తీసుకుని ఐద్వా నిర్మాణంలోకి వచ్చానని కొమరం స్వరాజ్యేశ్వరమ్మ పేర్కొన్నారు. అనంతరం సీనియర్ నేత బత్తుల హైమావతి పతాకాన్ని ఆవిష్కరించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, అఖిలభారత అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీకే శ్రీమతి, మరియం ధావళే, కోశాధికారి పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు సుధాసుందర్‌రామన్, రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జ్యోతి, డి.లక్ష్మి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఏలూరి జయమ్మ, చిత్రంలో మరియం ధావళే, శ్రీమతి, పుణ్యవతి, సుధా, మల్లు లక్ష్మి తదితరులు

మెప్మా ఉద్యోగులపై బదిలీ వేటు!

కొత్తగూడెం పట్టణం: ఇల్లెందు, మణుగూరు పురపాలికల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు మెప్మా సిబ్బందిపై బదిలీ వేటు పడినట్లు సమాచారం. ఇల్లెందు పురపాలికలో ఇద్దరు ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహించినందుకు అంతర్గత విచారణ అనంతరం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మణుగూరు పురపాలికకు బదిలీ చేశారు. మణుగూరులో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులను ఇల్లెందుకు బదిలీ చేశారు. నిధుల దుర్వినియోగం, సమైఖ్యలకు జరిగిన నష్టాలపై విచారణ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎస్పీ





మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు.. హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: అపరిష్కృత కేసుల్లో జాప్యాన్ని నివారించాలని ఎస్పీ బి.రోహిత్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. నేరస్థులకు న్యాయస్థానంలో కఠినంగా శిక్ష పడినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని, ఆ దిశగా కృషి చేయాలన్నారు. కొత్తగూడెంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వర్తించాలని సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫింగర్ ప్రింట్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన చంద్రుగొండ ఎస్సై స్వప్నను అభినందించారు. ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు డీఎస్పీలు చంద్రభాను, రెహ్మాన్, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యపై పట్టు సాధించాలి



కళాశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఐటీఐ విద్యపై విద్యార్థులు పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. కొత్తగూడెం రుద్రంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలను మంగళవారం సందర్శించారు. తొలుత విద్యార్థుల ప్రయోగశాలలను పరిశీలించారు. వెల్డర్, కంప్యూటర్ ఇతర ప్రయోగశాలల్లో అన్ని రకాల పరికరాలతో పాటు కావాల్సిన వసతులు అందుబాటులో ఉంచాలన్నారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అలాగే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్(ఏటీసీఎస్) కొత్త కోర్సుల్లో ప్రవేశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. అనంతరం భవన నిర్మాణాలను పరిశీలించి సత్వరమే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, విజేత, కళాశాల ప్రిన్సిపల్ గోనెల రమేశ్, ఎంఈఓ బాలాజీ, జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ అధికారి సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

సర్కారు వైద్యం.. అందనంత దూరం!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, భద్రాచలం

ప్రభుత్వ ప్రధానాసుపత్రులు మొదలు ఆరోగ్య ఉపకేంద్రాల వరకు వైద్యసిబ్బంది కొరత వేధిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 2023లోని పరిస్థితులపై కేంద్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఇటీవల వెలువరించిన 'హెల్త్ డైనమిక్స్ ఆఫ్ ఇండియా' నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

భద్రాద్రి జిల్లాలో వైద్యులు, సిబ్బంది కలిపి 490 మంది విధులు నిర్వర్తించాల్సి ఉండగా 316 మంది పనిచేస్తున్నారు. ఆరు సీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల దంత వైద్యులు, గైనకాలజిస్టులతోనే నెట్టుకొస్తున్నారు. ఖమ్మం జిల్లాలో పీహెచ్‌సీలు-26, పట్టణ ఆరోగ్య కేంద్రాలు-4, ఆరోగ్య ఉపకేంద్రాలు-231 ఉన్నాయి. పీహెచ్‌సీల్లో 76 వైద్యుల పోస్టులకు 27, స్టాఫ్ నర్సులు 70 పోస్టులకు 12, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫిమేల్) 213 పోస్టులకు 45, ఎంపీహెచ్‌డబ్ల్యూ(మేల్) 147 పోస్టులకు 107 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఫీల్డ్ వర్కర్స్ 45 పోస్టుల్లో 38 ఖాళీలే. వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖలో 662 పోస్టులకు 398 భర్తీకి నోచుకోలేదు. అనేకచోట్ల పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతులు మధ్య కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె, బస్తీ దవాఖానాలుగా మార్చినా ఆశించిన స్థాయిలో వైద్యమందటం లేదు.



వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సీహెచ్‌సీల పరిస్థితీ అంతంతే..

ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, పెనుబల్లి, మధిర, కల్లూరు, తిరుమలాయపాలెం, వైరా, నేలకొండపల్లిలో సీహెచ్‌సీలున్నాయి. సివిల్ సర్జన్లు 51 మందికి 33మంది లేరు. డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టుల్లో 52కు 48, సివిల్ అసిస్టెంట్ సర్జన్లలో 154కు 113 పోస్టులు భర్తీచేయలేదు. స్టాఫ్ నర్సుల్లో 147కు 36మంది లేరు. హెడ్‌నర్సు పోస్టుల్లో 31కి 21 ఖాళీలున్నాయి. మిడ్‌వైఫరీ పదకొండు పోస్టులకు పదింటిని భర్తీ చేయాల్సి ఉంది. రేడియోగ్రాఫర్లు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు ఇలా అనేక విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉండటంతో రోగులకు ఆశించిన స్థాయిలో సేవలందటం లేదు.

దూరభారంతో సతమతం

భద్రాద్రి జిల్లాలో సగటున 17 గ్రామాలకు ఒక పీహెచ్‌సీ ఉండగా 5వేల మందికి ఒక ఆరోగ్య ఉపకేంద్రం సేవలందిస్తోంది. జనాభాకు అనుగుణంగా ఆసుపత్రుల సంఖ్య పెరగట్లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో దూరభారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ వైద్యసేవలను విస్తరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని 23 మండలాల్లో 29 పీహెచ్‌సీలుండగా కొత్తగా పదకొండు పీహెచ్‌సీలు ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. జిల్లాలో 240 ఆరోగ్య ఉపకేంద్రాలుండగా.. మరో 30 కేంద్రాలను ఏర్పాటుచేయటానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. మారుమూల ప్రాంతాలకు వైద్యసేవలు విస్తరించేలా ఇప్పటికే బైక్ అంబులెన్స్‌లు పదింటిని సిద్ధం చేశారు. వైద్యవృత్తిలో అనుభవం కలిగిన ఉద్యోగి ద్విచక్రవాహనంపై వెళ్లి పల్లెల్లో వైద్యమందించాల్సి ఉంటుంది. రూ.2కోట్ల వ్యయంతో ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ వంటి అధునాతన రోగనిర్ధారణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావటానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

వైద్యసేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వైద్య సదుపాయాలకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించి ఐటీడీఏ పీఓ ద్వారా ఇటీవల ప్రభుత్వానికి నివేదించాం.

- భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ, భద్రాద్రి కొత్తగూడెం

జేకే 5 స్టార్

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

త్వరలో కాలపరిమితి ముగియనున్న ఇల్లెందు జేకే (జవహర్ ఖని) 5 ఉపరితల గని మరోసారి ప్రత్యేకతను చాటింది. 'ఫైవ్ స్టార్ రేటింగ్' అవార్డు సాధించిన ఘనతను దక్కించుకుంది. కోలిండియా, సింగరేణి, ప్రభుత్వ, ప్రైవేట్ భూగర్భ, ఉపరితల గనులకు సంబంధించి దేశవ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 380 గనుల్లో వివిధ అంశాలను ప్రామాణికంగా తీసుకొని ఈ అవార్డును బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ అందజేస్తుంటుంది. తెలంగాణ నుంచి ఇల్లెందు జేకే-5 ఉపరితల గనితో పాటు రామగుండం ఆర్‌జీఓసీ-1కి ఈ అవార్డును సోమవారం ప్రదానం చేసింది.



జేకే ఉపరితల గనిని పరిశీలిస్తున్న సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎన్.బలరాం, డైరెక్టర్లు, అధికారులు (పాత చిత్రం)

ఇదేచోట జల విద్యుత్తుకు సింగరేణి ప్రణాళికలు

హైడ్రోపవర్ కోసం వివిధ దేశాలు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో సింగరేణి సంస్థ సైతం ఆ దిశగా దృష్టి సారించింది. కాలపరిమితి ముగిశాక జేకే ఉపరితల గనిలో జలవిద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. రెండు నెలల క్రితం ఇక్కడి గని పరిసరాల్లో 20 మీటర్ల మేర నీటినిల్వలు ఉన్న ప్రాంతాలను సింగరేణి సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ఎన్.బలరాం, అధికారులు పరిశీలించారు. సింగరేణిలోనే తొలిసారి ప్రయోగాత్మకంగా ఇల్లెందులో జలవిద్యుత్తు ప్లాంట్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

★ ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషితో ఇల్లెందు జేకే-5 ఉపరితల గనికి అవార్డు దక్కింది. సరైన ప్రమాణాలు పాటించటం వల్లే ఈ ఘనత సాధ్యమైంది. ఉపరితల గని విస్తరణతో మరో 12 ఏళ్ల పాటు ఇల్లెందులో బొగ్గు ఉత్పత్తి కొనసాగనుంది.

- జాన్ ఆనంద్, సింగరేణి జీఎం, ఇల్లెందు ఏరియా

12 ఏళ్ల ప్రస్థానంలో..

జేకే-5 ఉపరితల గని 2012లో ప్రారంభమైంది. ఏటా నిర్దేశించిన లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి సాధిస్తూ ఇల్లెందు ఏరియాలో ప్రత్యేకంగా నిలిచింది. 2021-22లో 20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 24.97లక్షల టన్నులు, 2022-23లో 14.50 లక్షల టన్నుల లక్ష్యానికి 18.79 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించింది. 2023-24లో 8.71 లక్షల టన్నులు, ఈ ఆర్థిక సంవత్సరంలో 6 లక్షల టన్నుల లక్ష్యానికిగాను ఇప్పటికే 2 లక్షల టన్నులను ఉత్పత్తి చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ ఉపరితల గని కాలపరిమితి ముగియనుంది. ఈ తరుణంలో గని విస్తరణకు అనుమతులు రావటంతో మరో 12 ఏళ్ల పాటు ఇల్లెందులో బొగ్గు ఉత్పత్తి సాగనుంది.

తెల్లబంగారం.. నేలచూపులు

కొణిజర్ల, తల్లాడ, న్యూస్‌టుడే

పత్తి సాగుని నమ్ముకున్న రైతులకు ప్రతి ఏటా రుణభారం పెరుగుతూనే ఉంది. వానాకాలంలో మిగతా పంటల కంటే ఇదే కొంతవరకు సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు నమ్మి సాగు చేస్తున్నారు. గత మూడేళ్ల నుంచి వరస నష్టాలతో పత్తి రైతులు సతమతమవుతున్నారు. అధిక వర్షాలు.. పెట్టుబడుల భారం.. కూలీల కొరత.. దిగుబడులు తగ్గడంతో అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. సాగు కలిసిరాక పంట వేయడమే మానుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



పత్తితీతలో కూలీలు

పడిపోతున్న దిగుబడి

నాలుగేళ్ల క్రితం వరకు పత్తిలో ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఆ తర్వాత 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు పరిమితమవగా, రెండేళ్ల నుంచి 5 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వస్తోంది. ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి దెబ్బతిని 5 క్వింటాళ్లలోపే దిగుబడులు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు.. తెగుళ్ల కారణంగా దిగుబడులు గణనీయంగా తగ్గాయి. మరోవైపు పెట్టుబడులు ఆకాశాన్ని తాకగా, దిగుబడులు నేలచూపు చూస్తున్నాయి.

ఖమ్మం		భద్రాద్రి
1.99 లక్షలు	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	2.01 లక్షలు
1.09 లక్షలు	రైతుల సంఖ్య	1.10 లక్షలు

నష్టానికి కారణాలు ఇవీ?

★ తెగుళ్లను తట్టుకునే అధిక దిగుబడినిచ్చే విత్తనాలు లేకపోవడం ★ ఒక్కసారే కాయలు వచ్చి తక్కువ దిగుబడులు రావడం ★ పత్తిలో కలుపు, పత్తితీతలకు కూలీలు కొరత ★ తెగుళ్ల నివారణకు అధిక రసాయన మందుల పిచికారి ★ సేంద్రియ ఎరువులు లేక పూర్తిగా రసాయన ఎరువులపై ఆధారపడటం ★ వాతావరణ మార్పులతో అతివృష్టి లేదా అనావృష్టి పరిస్థితులు ★ సాగు వ్యయం భారీగా పెరిగి రాబడి రాకపోవడం

పత్తి సాగు.. ఎకరానికి ఖర్చు

దుక్కులు:	విత్తనాలు:	పాట్లు:	కూలీలు:
రూ.6,000	రూ.1,600	రూ.8,000	రూ.4,500

రసాయన మందులు:	రసాయన ఎరువులు:	మొత్తం ఖర్చు:
రూ.8,500	రూ.6,500	35,100

★ పత్తితీతకు ఎకరానికి రూ.5 వేలు ఖర్చు వస్తోంది. దానిని కూడా లెక్కలోకి తీసుకుంటే మొత్తం పెట్టుబడి సుమారు రూ.40 వేలు వస్తుంది)

దిగుబడి 5 క్వింటాళ్లకు బయట మార్కెట్లు ధర రూ.6 వేల ప్రకారం ఆదాయం రూ.30 వేలు

5 క్వింటాళ్లకు సీసీఐ మద్దతు ధర ప్రకారం ఆదాయం రూ.37,600

మిగులుబాటు లేదు: రేగళ్ల లక్ష్మణరావు, గంగదేవీపాడు, తల్లాడ మండలం



ఈ ఏడాది మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఎకరానికి రెండు క్వింటాళ్ల వరకు పత్తి తీసి రూ.5,800 చొప్పున విక్రయించాను. మరో క్వింటాల్ మాత్రమే వచ్చే అవకాశం ఉంది. అధిక వర్షాలతో పెట్టుబడులు రూ.35 వేల వరకు అయ్యాయి. పెట్టుబడులు కూడారాని పరిస్థితి నెలకొంది. కౌలు రైతులకు శ్రమకు తగ్గ ఫలితం దక్కదు.

పౌష్టికాభివృద్ధి..!

మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెరటి కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం

కూసుమంచి, న్యూస్‌టుడే

మహిళల ఆర్థికాభివృద్ధితోపాటు కుటుంబ సభ్యులకు పౌష్టికాహారాన్ని అందుబాటులో ఉంచే లక్ష్యంతో మహిళా శక్తి పథకం ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లాలో నాటుకోళ్ల పెంపకానికి ఊతమిస్తోంది. ప్రతీ మండలానికి 2వేల నాటుకోడి పిల్లలను అందుబాటులో ఉంచి ఎనిమిది వారాల వయసు దాటిన కోడి పిల్లలను స్వయం సహాయక సంఘాలకు సరఫరా చేయడం లక్ష్యంగా ప్రతీ మండలానికి ఒక మదర్ యూనిట్‌ను స్థాపిస్తున్నారు. ఇప్పటికే కూసుమంచి సహా, ఆరు మండలాల్లో యూనిట్లను స్థాపించారు. అన్ని మండలాల్లోనూ విస్తరణకు కార్యాచరణ చేపట్టారు.



కూసుమంచి మండలంలోని జుజ్జులరావుపేట మదర్ ఫారం యూనిట్‌లో నాటుకోడి పిల్లలు

కొనుగోలు మొదలు విక్రయం దాకా ఇలా..

1 నాటుకోళ్లలో ఎక్కువ రోజులపాటు గుడ్లు పెట్టే మేలురకం ఆసిన్, సోనాలి రకం కోళ్ల జాతులను ఎంపిక చేసుకొని కొనుగోలు చేస్తారు. 2వేల పిల్లలను అలా కొనుగోలు చేసి 'మదర్ ఫారం'లో పెంపకం చేపడతారు. ప్రతీ మండలంలో ఆసక్తి ఉన్న గ్రామ సమాఖ్యల సహకారంతో 'మదర్ ఫారం' స్థాపిస్తారు. పిల్లల కొనుగోలు, దాణా తదితర అవసరాలకు మండల సమాఖ్య సీఐఎఫ్ ద్వారా రూ.3 లక్షలు రుణ సౌకర్యం కల్పిస్తుంది. ఎనిమిది వారాల్లో మూడుసార్లు వ్యాక్సిన్, ఒకసారి కొక్కెర నిర్మూలన ఇంజెక్షన్ ఇస్తారు.

2 మదర్ ఫారంలో 8 నెలలపాటు పెరిగిన పిల్లలను మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు విక్రయిస్తారు. 30 నుంచి 50 పిల్లల వరకు సభ్యులకు అందిస్తారు. వాటి ఖరీదు, పోషణ నిమిత్తం రూ.7,500 చొప్పున రుణ సదుపాయం కల్పిస్తారు.

3 మదర్ ఫారం నుంచి కొనుగోలు చేసిన కోడిపిల్లలను సభ్యులు తమ పెరట్లో పెంపకం చేపట్టాలి. ఈ కోళ్లు సుమారు 100 నుంచి 120 రోజులపాటు నిరంతరాయంగా గుడ్లు పెడతాయి. సభ్యులు స్వీయ వినియోగంతోపాటు ఆదాయ మార్గంగా విక్రయించుకుంటారు. కొన్నాళ్లకు కోళ్ల సంఖ్య పెరిగిన అనంతరం వాటిని విక్రయించుకుంటూ జీవనోపాధి పొందొచ్చు.

కంటికి రెప్పలా ఎనిమిది వారాలపాటు..

- బాలి రాణి, కేంద్రం నిర్వాహకురాలు



కోడిపిల్లలను 8 వారాల పాటు పెంపకం చేపడతాం. 8, 12, 18వ రోజుల్లో వ్యాక్సిన్ వేస్తాం. ఎనిమిది వారాల వయసులో ఒకసారి కొక్కెర నివారణ ఇంజెక్షన్ అందిస్తాం. మేలు రకమైన దాణాను కొనుగోలు చేసి తెచ్చి వాటిని వయస్సు ఆధారంగా అందిస్తున్నాం. కోళ్ల పెరుగుదలలో తొలి ఎనిమిది వారాలు కంటికి రెప్పలా కాపాడుకుంటాం.

ఆదర్శంగా.. 'జుజ్జులరావుపేట'

కూసుమంచి మండలంలోని జుజ్జులరావుపేటలో శ్రావణి స్వయం సహాయక సంఘం ద్వారా సభ్యురాలు బాలి రాణి ఏర్పాటుచేసిన మదర్ యూనిట్ ఆదర్శంగా నిలుస్తోంది. గతేడాది ప్రయోగాత్మకంగా ఇక్కడ చేపట్టిన పిల్లల పెంపకం ప్రక్రియలోనూ నిర్వాహకులు లాభం గడించారు. కేంద్రాన్ని ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించి నిర్వాహకురాలిని అభినందించారు. అన్ని మండలాల ఏపీఎంలు, మండల సమాఖ్య బాధ్యులు యూనిట్‌ను సందర్శించారు.

ఆరు మండలాల్లో ఏర్పాటు - డీపీఎం శ్రీనివాస్

జుజ్జులరావుపేటతోపాటు, జిల్లాలోని ముదిగొండ, ఖమ్మం గ్రామీణం, బోనకల్లు, సత్తుపల్లి, వేంసూరులో ఇప్పటికే 'మదర్ ఫారం' యూనిట్లు స్థాపించాం. మిగిలిన మండలాల్లోనూ కొద్ది రోజుల్లోనే యూనిట్లు ఏర్పాటు చేస్తాం. విజయవంతమైన నిర్వహణ ద్వారా ప్రతీ బ్యాచ్‌కు (60 రోజులు) కనీసం రూ.60-70 వేల ఆదాయం పొందే అవకాశం ఉంది.

ఉషోదయం వేళ.. ఆహ్లాద మేళా



బువ్వ కోసం అవ్వ పోరాటం



తల్లి పాల కోసం ఆరాటం



పని కోసం పయనం


మణుగూరు మండలం రేగులగండి గ్రామంలో ఉదయపు రేఖలు ముందుగా వాలుతాయి. మంచుతెరలు కూడా ముందుగానే ఆవిరవుతాయి. ఎందుకంటే ఈ గ్రామం అటవీప్రాంతంలోని గుట్టపై ఉంటుంది. మంగళవారం ఉదయం గ్రామంలోని జీవనవిధానం దృశ్యాలను 'న్యూస్‌టుడే' కెమెరాలో బంధించింది.

– మణుగూరు, న్యూస్‌టుడే

పైన వాయుమార్గం.. కింద ధూమశకటం

ఇదీ మణుగూరు మండలం కూనవరం వద్ద రైల్వే మార్గంపై నిర్మించిన ప్రొటెక్షన్ బ్రిడ్జ్. భారజల ప్లాంటుకు బొగ్గును రవాణా చేసే బై కేబుల్ ఏరియల్ రోప్ వే సిస్టం సరిగ్గా ఈ ప్రదేశంలోనే రైల్వే మార్గంపై పయనించి దాటుతుంది. దాంతో ఆ ప్రదేశంలో రైల్వే మార్గంపై ఈ ప్రొటెక్షన్ బ్రిడ్జ్‌ను కట్టారు. తలవని తలంపుగా రోప్‌వే తెగినా బక్కెట్లు కిందపడ్డా రైల్వే మార్గానికి కలిగే నష్టం, ప్రమాదం అంటూ ఏమీ ఉండబోదు. అవి ఆ ప్రొటెక్షన్ బ్రిడ్జ్ పైనే పడతాయి. సుమారు వంద అడుగుల పైగా పొడవుతో ఈ బ్రిడ్జ్‌ను రైల్వే మార్గంపై నిర్మించారు.

– మణుగూరు గ్రామీణం, న్యూస్‌టుడే



రాములోరికి ఘనంగా కల్యాణం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి మంగళవారం సుప్రభాతం పలికి ఆరాధించి అర్చన చేశారు. ఇక్కడ కొలువైన సీతారామలక్ష్మణులను దర్శించుకుంటే అంతా శుభమే సిద్ధిస్తుందని సుభాషించారు. నిత్య కల్యాణం గురించి వైదిక పెద్దలు ప్రవచిస్తుండగా దీనికి అనుగుణంగా క్రతువు నిర్వహించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక నిర్వహించారు. అనుబంధంగా ఉన్న ఆంజనేయుడికి అభిషేకం చేశారు. హనుమాన్‌చాలీసాను పారాయణం చేసి సుందరకాండను పఠించారు. భక్తులు సింధూరాన్ని నుదట ధరించి తమలపాకుల పూజ చేశారు. ధర్మ ప్రచారంలో భాగంగా కోనసీమ జిల్లా పలివెల గ్రామంలో సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. రామాలయం నుంచి వెళ్లిన రామరథంలోని విగ్రహాలకు ఆలయ అర్చకులు భద్రాచలం సంప్రదాయంలో కల్యాణ వేడుక చేపట్టారు.

బ్యాంకు ఉద్యోగాలకు శిక్షణ

భద్రాచలం, న్యూస్‌టుడే: బ్యాంకు పీఓ, క్లర్ పోస్టులను పొందేందుకు వీలుగా గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించిందని ఐటీడీఏ పీఓ రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 60 రోజులపాటు శిక్షణ ఉంటుందని ఇందుకు 27 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. ఎంపికైన వారికి స్టడీ మెటీరియల్, ఉపకార వేతనం అందించనున్నట్లు వెల్లడించారు.

డీసీసీబీ ఖమ్మం గ్రామీణ బ్రాంచిలో అక్రమాలపై విచారణకు ఆదేశం

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ఖమ్మం గ్రామీణ బ్యాంకులో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలపై ప్రధాన కార్యాలయం డీజీఎం సర్వేశ్వర్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈమేరకు ఆయన బ్యాంకులోని పలు దస్త్రాలను పరిశీలించారు. గతంలో ఇక్కడ పని చేసిన బ్యాంకు మేనేజర్ తన బంధువులు, ఇతరులకు సరైన డాక్యుమెంట్లు లేకుండానే కోట్ల రుణాలు మంజూరు చేశారని, అదే విధంగా నాబార్డు సబ్సిడీ రుణాలను సైతం సంబంధిత రైతులకు చెల్లించకుండా ఇతర ఖాతాలకు మళ్లించి స్వాహా చేసినట్లు కొంతమంది ఫిర్యాదు జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. తాను పని చేసిన కాలంలో పలు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇతని అక్రమాలపై ప్రాథమిక విచారణ చేసి నివేదిక అందాల్సిందిగా జిల్లా అధికారులు ఆదేశించారు. భూమిలేని వారికి రుణాలు మంజూరు చేయటం, పీఎంజీ రుణాల్లో అక్రమాలకు పాల్పడటం లాంటి అంశాలపై ఇప్పుడు విచారణ జరుగుతోంది.

అంబులెన్స్, లారీ ఢీకొని ఆరుగురికి గాయాలు

తల్లాడ, న్యూస్‌టుడే: ఓ ప్రైవేట్ అంబులెన్స్, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం తల్లాడ బస్టాండ్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మునుకుళ్ల గ్రామానికి చెందిన సీహెచ్ కనకమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో తిరువూరు నుంచి ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తున్నారు. తల్లాడ బస్టాండ్ సమీపంలో రహదారి పక్కన నిలిపి ఉంచిన ఓ లారీని తప్పించే క్రమంలో డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరో లారీని అంబులెన్స్ ఢీకొంది. ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న డ్రైవర్ ఎన్.ప్రభాకర్, గ్రామీణ వైద్యుడు డి.గోపి, సీహెచ్.కోటయ్య, కనకమ్మ, కృష్ణమ్మ, ఆర్.కృష్ణవేణి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను తల్లాడ, ఏన్కూరు 108 వాహనాల్లో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లాడ ఎస్సై బి.కొండలరావు ఘటనా స్థలానికి చేరుకొని రహదారిపై ఉన్న అంబులెన్స్‌ను జేసీబీ సాయంతో పక్కకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



అంబులెన్స్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్



ప్రమాదంలో గాయపడ్డ మహిళ

ఉపాధి కోసం వచ్చి అనంతలోకాలకు..

◆ రోడ్డు ప్రమాదంలో ఖమ్మంవాసి మృతి

గాండ్లపేట్(మోర్తాడ్), న్యూస్‌టుడే: ఉపాధి కోసం వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన మోర్తాడ్ మండలం గాండ్లపేట్ 63వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకొడవకు చెందిన కాకర్ల గోవింద్, లక్ష్మి దంపతులు ఉపాధి నిమిత్తం సోమవారం మోర్తాడ్‌కు వచ్చి స్థానికంగా ఓ ఇంట్లో అద్దెకు దిగారు. రాత్రి బయటకు వెళ్లిన గోవింద్ అద్దెకు తీసుకున్న ఇంటిని మర్చిపోయి 63వ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. సమాచారమందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గోవింద్ మంగళవారం మృతిచెందారు. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిబంధనల మేరకు బాణసంచా దుకాణాలు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిబంధనల మేరకు బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పొడిశెట్టి శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రజలు సంతోషంగా దీపావళి పండుగ నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. 31న దీపావళి పండుగ రోజు పగలు, రాత్రి స్పెషలిస్ట్ వైద్యులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎలాంటి ప్రమాదాలు జరిగినా సహాయం కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1077కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. ఎస్పీ ఏసీపీ సాంబరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జకీరుల్లా, డీఎంహెచ్ఓ సుబ్బారావు పాల్గొన్నారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)			
పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్త పత్తి	6,000	7,000	6,700
పెసలు	4,200	7,100	6,600
మొక్కజొన్నలు	2,251	2,251	2,251
ఏసీ ఎండుమిరప	9,500	19,000	16,500
ఎండుమిరప	8,500	17,500	13,500
ఏసీతాలుమిరప	8,200	8,200	8,200

ఉరి వేసుకొని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



వడ్తియా చైతన్య

కూసుమంచి, న్యూస్‌టుడే: కూసుమంచి మండలంలోని గంగబండతండాకు చెందిన వడ్తియా చైతన్య(19) అనే డిగ్రీ విద్యార్థిని గురువారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు మిరప క్షేత్రంలో పనులు చేస్తున్న సమయంలో ఒంటరిగా ఉన్న చైతన్య ఇంట్లో పంకాకు ఉరి వేసుకుంది. వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఇంటి తలుపులు లోపల నుంచి వేసి ఉండటంతో పాటు విద్యార్థిని పలకకపోవడంతో తలుపులను ధ్వంసం చేసి లోనికి వెళ్లే సరికి కుమార్తె ఉరి వేసుకొని కన్పించింది. తనికెళ్లలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దసరా సెలవులకు వచ్చి ఇంట్లోనే ఉంటోంది. అనారోగ్యం కారణంతో కళాశాలకు వెళ్లలేదని, అదే కారణంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు. ఎస్ఐ నాగరాజు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు.

సెల్‌ఫోన్ ధర చెల్లించండి

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ షాపింగ్‌లో కొనుగోలు చేసిన సెల్‌ఫోన్ ధర రూ.29,999లను ఫిర్యాదుదారుకు తిరిగి చెల్లించాలని అమెజాన్ కంపెనీని ఆదేశిస్తూ ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు చెప్పింది. కేసు వివరాల ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన జి.కృష్ణారెడ్డి 2023 మార్చి 28న అమెజాన్ సైట్‌లో రూ.29,999లకు ఐకూ కంపెనీ సెల్‌ఫోన్ కొనుగోలు చేశారు. దాన్ని తాను సూచించిన అడ్రస్‌లో అందించకుండానే డెలివరీ చేసినట్లు ఆన్‌లైన్ స్టేటస్ చూపించడంతో కంపెనీ ప్రతినిధులను సంప్రదించారు. వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఫిర్యాదుదారు జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. ఓటీపీ విధానం ద్వారా వస్తువులను భద్రంగా వినియోగదారులకు అందచేస్తామని, సెల్‌ఫోన్‌ను కొనుగోలుదారు సూచించిన చిరునామాలో అందజేశామని అమెజాన్ కంపెనీ వాదించింది. ఇరుపక్షాల వాదనలు విన్న కమిషన్ ఛైర్‌పర్సన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత అమెజాన్ ఆన్‌లైన్ సంస్థ సేవా లోపాన్ని నిర్ధారించారు. సెల్‌ఫోన్ ధర రూ.29,999తోపాటు ఫిర్యాదుదారు మనో వేదనకు గురిచేసినందుకు రూ.10 వేలు, కేసు ఖర్చుల కింద మరో రూ.10 వేలు చెల్లించాలని ఆదేశించారు.

తనయుడి అంత్యక్రియలకు హాజరై తనువు చాలించిన తల్లి



సులోచన


ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కుమారుడు మృతి చెందడంతో కడసారి చూసేందుకు వచ్చిన తల్లి తనువు చాలించిన విషాద ఘటన కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన పసుపులేటి నరేందర్ గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. తల్లి సులోచన(80) మరో కుమారుడు కృష్ణ కుటుంబంతో కలిసి ఏపీలోని వైజాగ్‌లో ఉంటున్నారు. మంగళవారం ఇల్లెందుకు వచ్చిన ఆమె అచేతన స్థితిలో ఉన్న కుమారుడిని చూసి తల్లి హృదయం తట్టుకోలేకపోయింది. నరేందర్ అంత్యక్రియలు ప్రారంభమవుతుండగా ఏడుస్తూ కుప్పకూలారు. కుటుంబ సభ్యులు సీపీఆర్ చేసి ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించిన కొంత సేపటికే మృతి చెందింది. కుమారుడి అంత్యక్రియలు జరగ్గా బుధవారం సులోచన అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు, బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా సీతారామటాకీసు వెనుక ఖాసీ ఆశీష్‌అసిర్ ఖానాలో మొహరం వేడుకను వీరి కుటుంబ సభ్యులు మూడు తరాలుగా నిర్వహిస్తున్నారు. ఆ వేడుకకు నాలుగు నెలల క్రితం కుటుంబ సభ్యులంతా కలిశారు.

డమ్మీ పిస్టల్‌తో బెదిరింపు.. దుండగుడి అరెస్టు

దామెర, న్యూస్‌టుడే: డబ్బు కోసం డమ్మీ పిస్టల్‌తో బెదిరించిన దుండగుడిని అరెస్టు చేసినట్లు పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. దామెర పోలీస్‌స్టేషన్‌లో ఆయన మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తదనంతరం ఎన్ని పనులు చేసినా ఎక్కువ డబ్బు రాకపోవడంతో ఖమ్మం శివారులో పలు కిరాణా దుకాణాలకు వెళ్లి మాజీ నక్సలైట్‌నంటూ బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. డమ్మీ పిస్టల్‌తో బెదిరిస్తే మరింత డబ్బు వసూలు చేయవచ్చునని భావించి హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొన్నాడు. అతడిపై ఖమ్మం జిల్లా పరిధిలో పదికి పైగా కేసులు నమోదయ్యాయి. వెంకటేశ్వర్లు రూ.800తో మరో నకిలీ తుపాకీ కొన్నాడు. వరంగల్‌లో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో ఈనెల 21న ఖమ్మం నుంచి రైలులో అక్కడికి చేరుకున్నాడు. అర్ధరాత్రి వేళ ఊరుగొండకు వెళ్లాడు. అక్కడ కిరాణ దుకాణం యజమాని కందికొండ సంపత్‌ను నిద్రలేపి సిగరెట్ తీసుకుంటున్న క్రమంలో డమ్మీ పిస్టల్ చూపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. లేవని చెప్పిన సంపత్‌ను కిందపడేసి గల్లాపెట్టెలో రూ.2వేలు తీసుకొని, తాను నక్సలైట్‌నని, ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడు. ఈక్రమంలో సంపత్ అతడిని గట్టిగా పట్టుకుని కేకలు వేశాడు. స్థానికులు గుమిగూడి వెంకటేశ్వర్లును బంధించి డమ్మీ పిస్టల్‌ను లాక్కొని పోలీసులకు అప్పగించారు. సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు వెంకటేశ్వర్లును కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

రైలు మార్గం.. ఎటు వైపో..!

రామాలయం అభివృద్ధి పనులపై చిగురిస్తున్న ఆశలు



భద్రాచలం



భద్రాచలం పట్టణం వద్ద రైలు మార్గం ఎటు వైపున ఉంటుందోనన్న చర్చ కొద్ది రోజులుగా జోరుగా సాగుతోంది. ఇక్కడి పరిస్థితుల ప్రకారం స్థానిక కొర్రాజులగుట్టకు అవతల నుంచి ట్రాక్ నిర్మించే వీలుందని భావిస్తున్నారు. ఇది వీలుకాని పక్షంలో గతంలో చేసిన సర్వే ప్రకారం భద్రాచలం శివారున అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం మేడువాయి గ్రామం గుండా గోదావరి మీదుగా బూర్గంపాడు మండలం పాండురంగాపురం వరకు రైల్వే లైన్ ఏర్పడే వీలుందని అంచనా వేస్తున్నారు.

– భద్రాచలం, న్యూస్‌టుడే

ఒడిశాలోని మల్కనగిరి నుంచి భద్రాచలం మీదుగా పాండురంగాపురం వరకు 173.61 కి.మీ. మార్గం నిర్మాణానికి కేంద్రం రూ.3591.76 కోట్లను రెండు నెలల కిందట మంజూరు చేసింది. ఇందులో భద్రాచలం నుంచి పాండురంగాపురం వరకు 20 కి.మీ. ఉండగా గోదావరిపై 2 కి.మీ పొడవైన భారీ వంతెన ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు మరో ఐదారేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించడంతో.. స్థల పరిశీలనకు ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు దృష్టి సారించనున్నాయి. స్థల సేకరణకు రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం రావాల్సి ఉంది. మొత్తంగా 846 ఎకరాలను సేకరించాల్సి ఉండగా భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలో తక్కువ భూమి సరిపోతుందని అంచనా.

ఇక్కడి నుంచే ప్రారంభిస్తే బాగు..

ఒడిశా నుంచి పనులు ప్రారంభిస్తే ఇక్కడకు వచ్చే సరికి దీర్ఘకాలం పట్టే వీలుంది. వేర్వేరు ప్యాకేజీల ప్రకారం పనులు చేపట్టినా ఈ ప్రాంతానికి తొలి ప్రాధాన్యతను ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం ఈ ప్రాంతంలో వ్యక్తమవుతోంది. పాండురంగాపురం రైల్వే స్టేషన్ కొత్తగూడెం-మణుగూరు మధ్యలో ఉంది. పాండురంగాపురం వద్ద నుంచి పనులు ఆరంభిస్తే భద్రాచలం వరకు నూతనమార్గం మూడేళ్లలోనే అందుబాటులోకి వస్తుందని అంచనా. ఇదే జరిగితే రామాలయానికి వచ్చే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది. దేశం నలుమూలల నుంచి రాకపోకలు పెరుగుతాయి. ఈ ఏడాది శ్రీరామ నవమి సమయంలో గోదావరిపై వాహనాల రాకపోకలకు రెండో వంతెన అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుంచి ట్రాఫిక్ చిక్కులు తొలగాయి. భవిష్యత్తులో కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పడుతుందన్న ఆశ జిల్లా వాసుల్లో ఉంది. ఇప్పటికే ఏడాదికి కోటి మంది భక్తులు రామాలయానికి వస్తున్నారన్నది అంచనా. రామయ్య చెంతకు రైల్వే లైను వస్తే ఈ ప్రాంతానికి మరింత అభివృద్ధి అవకాశం అందినట్లే.

అన్నీ మంచి శకునాలే..

★ ఆలయం వద్ద మాడవీధుల విస్తరణకు స్థల సేకరణ చేస్తున్నారు. కొందరు ఇంటి యజమానులు స్టే తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ వారిని అధికారులు సమన్వయం చేసుకుంటున్నారు.

★ సర్వే పూర్తయితే మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భారీ నిధులతో కోవెలను అభివృద్ధి చేయనున్నారు. మరో వైపున ప్రసాద్ పథకం ద్వారా రూ.42 కోట్లతో ఆలయ పరిసరాలలో పనులు కొనసాగుతున్నాయి.

★ కూనవరం రోడ్డులోని శిశుమందిర్ సమీపంలో కరకట్ట నిర్మాణ పనులు ఇంకొంత కాలంలో పూర్తి కానున్నాయి. ఇది పూర్తయితే ఈ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలకు ముంపు ఉండదు.

చికెన్ ధరలు	వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

కరకట్ట రక్షణే ముఖ్యం.. ఆక్రమణలు తొలగించాల్సిందే..!

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: కరకట్ట రక్షణే ముఖ్యం.. కట్టను ఆక్రమించిన ఆక్రమణలు తొలగించాల్సిందేనని అధికారులు హెచ్చరిస్తున్నారు. భద్రాచలంలో మంగళవారం కరకట్ట ప్రాంతంలో నీటిపారుదల, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కట్ట పటిష్ఠతపై సర్వే చేశారు. కరకట్ట మధ్య భాగం నుంచి దిగువకు 50 మీటర్ల వరకు కట్టకు సంబంధించిన భూభాగమేనని దీన్ని ఎవ్వరూ ఆక్రమించినా తక్షణమే ఖాళీ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. తెలిసోతెలియకో కట్టను ఆనుకొని నిర్మాణం చేపట్టిన ఇళ్లను త్వరలో ఖాళీ చేయించనున్నారు. పూర్తి వివరాలు సేకరించి మ్యాపింగ్ చేస్తున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరకట్ట ప్రాంతం సర్వే చేపట్టామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. జేఈలు వెంకటేశ్, హర్ష, గిర్దావర్ నర్సింహారావు, రెవెన్యూ సర్వేయర్లు పాల్గొన్నారు.

'మరోసారి భిక్షాటన తప్పు చేయొద్దు'



చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న స్వర్ణలత లెనినా

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: వీధుల్లో బాలలను ఎత్తుకొని భిక్షాటన తప్పని.. మరోసారి చేయొద్దని జిల్లా మహిళా సంక్షేమాధికారిణి స్వర్ణలత లెనినా బాలల తల్లిదండ్రులను మంగళవారం హెచ్చరించారు. భిక్షాటన నిర్మూలన చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భద్రాచలంలో పాటు పలు చోట్ల బాలల హెల్ప్‌లైన్, బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ సమితి సభ్యులు సోమవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 14 మంది చిన్నారులను స్థానిక శిశుగృహ కేంద్రానికి తరలించిన సంగతి తెలిసిందే. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు మంగళవారం శిశుగృహ కేంద్రానికి చేరుకుని బాలలతో ఇకపై భిక్షాటన చేయబోమని.. తొలితప్పుగా భావించి పిల్లలను ఇవ్వాలని వేడుకున్నారు. ఈ సమయంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సైతం జిల్లా కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడారు. జిల్లా మహిళా సంక్షేమాధికారిణి స్వర్ణలత లెనినా ఆధ్వర్యంలో హాజరైన చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. భిక్షాటన చేస్తూ మళ్లీ పట్టుబడితే పిల్లలను ఇక్కడే ఉంచి చదివించడం జరుగుతుందని హెచ్చరించారు. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయబోమని లిఖితపూర్వకంగా అంగీకరించి తమ పిల్లలను తీసుకొని వెళ్లిపోయారు.

సొసైటీ ఇసుక తమకే కేటాయించాలంటూ ధర్నా

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తమ సొసైటీకి సంబంధించిన ఇసుకను తమకే కేటాయించాలంటూ సమ్మక్క-సారక్క సొసైటీ సభ్యులు మంగళవారం మణుగూరులోని తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన ప్రదర్శన

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవాల అవగాహన ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. పీహెచ్‌సీకి వచ్చే ప్రజలకు అయోడిన్ లోపం వల్ల వచ్చే నష్టాలు, రుగ్మతలపై ప్రోగ్రాం అధికారి డాక్టర్ మధువరన్, వైద్యాధికారి సుభాష్ అవగాహన కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033



సమస్య: గుంపెన పంచాయతీ కట్టుగూడెం గ్రామ శివారులోని రహదారి పక్కన స్థానికులు ప్లాస్టిక్ వ్యర్థాలతోపాటు, చెత్త, చెదారం పడేస్తున్నారు. దీంతో అక్కడ దుర్వాసన వస్తోంది. సమస్యకు పరిష్కారం చూపగలరు. **- రాము, గ్రామస్థుడు**

సమాధానం: ఆ ప్రదేశంలో చెత్తవేసేవారి పలువురికి గతంలో నోటీసులు అందజేశాం. అయినా మార్పు రావడంలేదు. చెత్తను తొలగించి తగు చర్యలు చేపడతాం. **- శాంతి, పంచాయతీ కార్యదర్శి**

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే

ప్రాణం తీస్తున్న నిర్లక్ష్యం

వన్యప్రాణుల వేటగాళ్ల తీరుతో పొంచి ఉన్న ముప్పు

ములకలపల్లి, న్యూస్‌టుడే

అటవీ అధికారుల నిర్లక్ష్యం.. వేటగాళ్ల తెంపరితనం.. పశువుల కాపరులకు ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తోంది. వన్య ప్రాణుల సంరక్షణ కోసం అటవీ ప్రాంతాల్లో నిఘా కెమెరాలతో పటిష్ఠ చర్యలు చేపడుతున్నామంటూ అటవీ అధికారులు చెబుతున్నా అది ఆచరణకు నోచుకోవడం లేదు. దాహార్తి తీర్చుకునేందుకు వస్తున్న వన్యప్రాణుల వేట ములకలపల్లి మండలంలో యథేచ్ఛగా సాగుతోంది. ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి, కొత్తగూడెం అటవీశాఖ రేంజ్‌ల పరిధిలో విస్తారంగా అటవీ ప్రాంతం ఉంది. వన్యప్రాణుల సంచారమూ ఎక్కువే. దీంతో వేటగాళ్లు నాటు తుపాకులతో సంచరించడంతోపాటు.. ఇనుప తీగలకు విద్యుత్తు సరఫరా చేస్తూ వేట సాగిస్తున్నారు. ఆ తీగల బారిన పడి అమాయక రైతులు, పశువుల కాపరులు సైతం మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి.



మాధారం అటవీ ప్రాంతంలో ఎయిర్ వాల్వు సమీపంలో ఏర్పాటు చేసిన తీగలు (పాత చిత్రం)

నీటి వనరులకు సమీపంలో..

దాహార్తి తీర్చుకునేందుకు వచ్చే వన్యప్రాణులే లక్ష్యంగా అటవీ ప్రాంతంలో నీటి కుంటలు, చెరువులు, సాసర్‌పిట్లకు సమీపంలో వన్యప్రాణుల అడుగుజాడలను గుర్తించి వేటగాళ్లు అవి సంచరించే మార్గంలో రెండు నుంచి మూడు అడుగుల ఎత్తులో ఇనుప తీగలను అమర్చుతున్నారు. వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరా చేసే తీగలకు వాటిని అనుసంధానం చేస్తున్నారు. జిల్లా పాల్వంచ రేంజి మాధారం బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలోని ఈదులవాగు వద్ద ఇనుప తీగలను స్థానికులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వాటిని తొలగించారు.

★ చంద్రుగొండ మండలం పోకలగూడెం గ్రామానికి చెందిన ఓ రైతు పొలానికి వెళ్లే క్రమంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్తు ఇనుప తీగలు తగిలి మృత్యువాత పడ్డాడు.

★ రెండేళ్ల క్రితం ములకలపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మాధారం శివారు అటవీ ప్రాంతంలో రాత్రి వేళ వేటకు వెళ్లి వారు అమర్చిన తీగలకే తగిలి మృతి చెందారు.

★ దమ్మపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి పూసుగూడెం శివారులోని అటవీ ప్రాంతంలో వేటకు వెళ్లగా నాటు తుపాకి పేలి మృత్యువాత పడ్డాడు.

★ పలు పశువులు మృత్యువాత పడినా లేదా ప్రమాదానికి గురైనా బాధితులకు నగదు ఆశచూపి స్థానిక నాయకులు వాటిని బయటకు రానివ్వకుండా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

చర్యలు తీసుకుంటాం...

ఈ పరిస్థితిపై ములకలపల్లి ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా విద్యుత్తు శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుని తనిఖీలు చేస్తున్నామని, నిత్యం విద్యుత్తు అంతరాయం ఏర్పడే ప్రదేశాలను గుర్తించి అక్కడ తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. అటవీశాఖ సిబ్బందితోనూ నిఘా ఉంచామని, వన్యప్రాణుల వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

తీరిన విద్యార్థుల కష్టాలు



మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరు గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో ఉన్న ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కరెంటు కష్టాలు తొలగాయి. గత ఐదు రోజులుగా పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో 'ఒకవైపు చీకటి.. మరోవైపు ఉక్కపోత' అనే శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన విద్యుత్ సిబ్బంది ఉదయమే పాఠశాలకు వచ్చి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో చీకటి గదుల్లో వెలుతురుతోపాటు ఉక్కపోత తీరేందుకు ఫ్యాన్లు తిరగడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

టేకు కలప పట్టివేత

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధి పర్ణశాల సెక్షన్‌లోని గౌరవరం-కె.లక్ష్మీపురం మధ్య అక్రమ టేకు కలపను అటవీశాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. కొందరు స్మగ్లర్లు టేకు దిమ్మెలకు తాడుకట్టి గుబ్బలమంగి వాగులో అక్రమంగా దాచిపెట్టారు. సమాచారం అందుకున్న ఫారెస్టు రేంజి అధికారి కమల తన సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించారు. వాగులో దాచిన 9 టేకు దిమ్మెలను బయటకు తీసి స్వాధీనం చేసుకొని ట్రాక్టర్‌లో భద్రాచలం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. అక్రమ టేకు కలప ఖరీదు సుమారు రూ.లక్ష ఉంటుందని అంచనా వేశారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరు సమితిసింగారంలోని ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహానికి అలంకరించి ఉన్న వెండి ఆభరణాలు, పూజా సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో దొంగిలించారు. నిత్యం రద్దీగా ఉండే సమితిసింగారం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆలయంలో దొంగతనం విశేషం. కాగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

అశ్వాపురం, న్యూస్‌టుడే: కుక్కల దాడిలో ఎలకలగూడెం గ్రామానికి చెందిన కలేటి పొట్టెమ్మ అనే మహిళకు మంగళవారం గాయాలయ్యాయి. అదే సమయంలో అటు వైపుగా క్షేత్ర పర్యటనకు వెళ్తున్న అశ్వాపురం అటవీ క్షేత్ర అధికారి సిద్ధబోయిన రమేశ్, బీట్ అధికారి సునీల్‌కుమార్, డ్రైవర్ మహేందర్ విషయం గమనించి ఆ మహిళను కుక్కల దాడి నుంచి కాపాడారు. ఆమెకు అశ్వాపురం పీహెచ్‌సీలో ప్రథమచికిత్స అనంతరం భద్రాచలం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అటవీశాఖ సిబ్బందిని పలువురు అభినందించారు.

కొనసాగుతున్న విచారణ

అశ్వాపురం, న్యూస్‌టుడే: నెల్లిపాకబంజర లోని నెల్లిపాక తపాలా బ్రాంచి కార్యాలయంలో రూ.లక్షల గోల్‌మాల్ వ్యవహారంపై విచారణ కొనసాగుతోంది. రెండో రోజు మంగళవారం కూడా మణుగూరు ఐపీ రామమూర్తి, మెయిల్ ఓవర్సీల్ సుధీర్ తదితరులు సందర్శించి విచారణను కొనసాగించారు. ఖాతాదారుల పుస్తకాల పరిశీలన చేపట్టారు. ఖాతాదారుల నుంచి వ్యక్తిగతంగా కూడా ఫిర్యాదులు స్వీకరించారు. సమగ్ర విచారణ పూర్తి కావడానికి ఇంకా కొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది.

ప్రమాదకరంగా రహదారి..!

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ర.భ.శాఖ ప్రధాన రహదారి గోతులమయంగా తయారైంది. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సరిహద్దున కొత్తపల్లి చివర గ్రామంగా ఉంది. కొంతకాలంగా ఈ రహదారి అనేక చోట్ల దెబ్బతింది. సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో రానురాను ప్రమాదాలకు నిలయంగా మారింది. గోతుల పడిన చోట్ల నామమాత్రంగా గ్రామస్థులు బండరాళ్లు వేసి పూడ్చారు. ఇటీవలి కాలంలో అనేక మంది ప్రయాణికులు ఈ రహదారిపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలపాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి. మూడు రాష్ట్రాల ప్రజలు ప్రయాణించే ఈ రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రాళ్లతో కప్పిన గుంతలు

– దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

వద్దంటే.. వినదే..



పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ మొక్కలను తొలగించాలన్న ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మణుగూరులోని ప్రధాన రహదారి మధ్యలో డివైడర్లపై ఉన్న మొక్కలను ఇటీవల పురపాలక సిబ్బంది తొలగించారు. కానీ కట్టర్ యంత్రం సహాయంతో కోనోకార్పస్ మొక్కల మొదట్లో మాత్రమే కట్ చేయడంతో అవి మళ్లీ చిగురించి వేగంగా పెరుగుతున్నాయి. ఈ విషయమై పురపాలక కమిషనర్ ఉమా మహేశ్వరరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తాను సెలవుల్లో ఉన్నానని, పరిశీలిస్తామన్నారు. – మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల సౌకర్యం: పాయం



వీరాపురంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

కరకగూడెం, న్యూస్‌టుడే: కరకగూడెం మండలంలోని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. మంగళవారం రేగళ్ల, భట్టుపల్లి, సమత్‌భట్టుపల్లి, కన్నాయిగూడెం పంచాయతీలలో సుమారు రూ.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన 8 సీసీరోడ్లను ప్రారంభించారు. అలాగే రేగళ్ల, సమత్ భట్టుపల్లి, కన్నాయిగూడెం పంచాయతీలో అన్ని శాఖల అధికారులతో సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు, కార్యకర్తలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఏఎస్ పథకానికి విద్యార్థుల ఎంపిక

భద్రాచలం, న్యూస్‌టుడే: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ప్రతిభ చాటాలని ఐటీడీఏ డీడీ మణెమ్మ తెలిపారు. ప్రైవేటు విద్యాలయాల్లో 'బీఏఎస్' ద్వారా గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసించవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం ఐటీడీఏలో మంగళవారం లాటరీ ద్వారా భర్తీ చేశారు. ఎంఈఓ రమ, ఏసీఎంఓ రమణయ్య పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో మెచ్చా పూజలు

దమ్మపేట, న్యూస్‌టుడే: ముష్టిబండ పంచాయతీ వడ్లగూడెం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి గట్టులో నూతనంగా నిర్మించిన షిర్డీసాయిబాబా మందిరాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం సందర్శించి పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి వితరణ

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ముసలిమడుగు గ్రామంలో వాగే సత్యం పూరిల్లు ప్రమాదవశాత్తు సోమవారం దగ్ధమవడంతో సర్వం కోల్పోయాడు. దీంతో స్పందించిన గ్రామస్థులు, ఉద్యోగులు రూ. 20వేల నగదు, నిత్యావసరాలు, దుస్తులు, పాత్రలు, బియ్యం, కూరగాయలు, సామగ్రి అందజేశారు.

అనుమతులు లేని కట్టడాలను తొలగించాలి

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వినాయకపురంలో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని తెదేపా మండల అధ్యక్షుడు నార్లపాటి శ్రీను పంచాయతీ వారికి మంగళవారం వినతిపత్రం అందించారు. వినాయకపురం చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం నుంచి షిర్డీ సాయిబాబా ఆలయం వరకు భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపుల ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కట్టడాలు నిర్మించారని ఆయన పేర్కొన్నారు.

అక్రమ కేసులను సహించేది లేదు

ములకలపల్లి, న్యూస్‌టుడే: ఆదివాసీలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని ఆదివాసీ ఐకాస రాష్ట్ర నాయకులు కుంజా రాజులు అన్నారు. మంగళవారం ములకలపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడారు. తాత్కాలిక రహదారి నిర్మాణానికి ధర్నా చేసిన తాళ్లపాయి పంచాయతీలోని 11 మందిపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నియంతృత్వ పోకడలను అనుసరిస్తూ, అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు.

తహసీల్దారుకు సన్మానం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య దుమ్ముగూడెం మండల తహసీల్దారు మామిడి అశోక్ కుమార్‌ను మంగళవారం భద్రాచలంలో సన్మానించారు. సీతంపేట, కన్నాయిగూడెం వద్ద రహదారి గోతులు ఏర్పడి వాహనదారులకు, ప్రజలకు నెలకొనడంతో తహసీల్దారు సొంతఖర్చుతో గుంతలు పూడ్పించారని తెలుసుకుని ఆయనకు శాలువా కప్పి పొదెం వీరయ్య సన్మానించారు.

మునగ సాగుతో అధిక ఆదాయం: ఏడీఏ

చంద్రుగొండ, న్యూస్‌టుడే: మునగసాగుతో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉందని అశ్వారావుపేట వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రవికుమార్ అన్నారు. చంద్రుగొండ రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. మునగ పంట ఎకరం సాగుచేస్తే ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రభుత్వం రూ. 1.23 లక్షలు ఇస్తుందన్నారు.

మహాపాదయాత్రను జయప్రదం చేయండి

బూర్గంపాడు, ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 25న నిర్వహించనున్న మాలల మహాపాదయాత్రను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ కోరారు. బూర్గంపాడు, మోరంపల్లి బంజర గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేపట్టారు.

'కమ్యూనిస్టు పార్టీని కాపాడుకోవాలి'

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: త్యాగాలకు, పోరాటాలకు పురిటిగడ్డ అయిన భారత కమ్యూనిస్టు పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య అన్నారు. మణుగూరులోని చిక్కుడుగుంటలో మంగళవారం నిర్వహించిన శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 26న సీపీఐ శతజయంతి ఉత్సవాలను వాడవాడలా నిర్వహించాలన్నారు.

'తెజస సభ్యత్వ నమోదు'

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: తెలంగాణ జనసమితి జెండాలను గ్రామగ్రామాన ఎగరవేస్తామని పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి జి.శంకర్‌రావు అన్నారు. మండలంలోని గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోందన్నారు. ప్రొఫెసర్ కోదండరాం ఈనెల 24న భద్రాచలంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారని తెలిపారు.

ఇసుక రీచ్‌ను సమర్థంగా నిర్వహించాలి: పీఓ

దుమ్ముగూడెం, చర్ల, న్యూస్‌టుడే: మహిళలు సొంతంగా ఇసుక ర్యాంపులు నిర్వహిస్తూ జీవనోపాధిని పెంపొందించుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. నందులచెలక గ్రామ శివారులో ఆయన మంగళవారం పర్యటించి ఇసుక ర్యాంప్‌ను పరిశీలించారు. అలాగే చర్ల మండలం వీరాపురంలోని ర్యాంపునూ సందర్శించారు. ర్యాంపు నిర్వహిస్తున్న గిరిజన మహిళలతో కొద్దిసేపు మాట్లాడి వారికున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన మహిళలు సమర్థంగా ఇసుక ర్యాంప్‌లు నిర్వహించుకుంటూ కుటుంబాలను పోషించుకోవాలని, ప్రతిఒక్కరు ఉపాధి అవకాశం పొందాలని అన్నారు. గిరిజన మహిళలు ఇసుక ర్యాంప్‌ల పూర్తి బాధ్యతలు చేపట్టి ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఏటీడీఓ అశోక్‌కుమార్, టీఎస్ఎండీసీ పీవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఇసుక ర్యాంపు వద్ద వివరాలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

వంశీకి అభినందన

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించిన పవర్‌లిఫ్టర్ వంశీని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ మంగళవారం అభినందించారు. గిరిజన ప్రాంతం నుంచి ఆదివాసీ ముద్దుబిడ్డ అద్వితీయమైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని వంశీని అభినందించారు.

వ్యవసాయ కళాశాల ఆచార్యునికి సన్మానం



ఆచార్య గోపాలకృష్ణను సన్మానిస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో సుదీర్ఘకాలం ఆచార్యునిగా పనిచేసిన కె.గోపాలకృష్ణమూర్తిని విద్యార్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు. వ్యవసాయ కళాశాలలో మూడో బ్యాచ్ విద్యార్థిగా 1992లో ఇక్కడే విద్యాభ్యాసం చేసిన కె.గోపాలకృష్ణమూర్తి అనంతరం ఇక్కడికే ఆచార్యునిగా వచ్చారు. సుదీర్ఘ కాలం అక్కడ ఇక్కడ పనిచేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ సాంకేతిక సహాయకులుగా బదిలీ కావడంతో ఆయనను విద్యార్థులు సన్మానించారు. ఆచార్యులు రాంప్రసాదు, శిరీష, మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుమురం భీం జయంత్యుత్సవాలు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఆదివాసీల ఆరాధ్య నాయకుడు కుమురం భీం జయంతిని అశ్వారావుపేటలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో కుమురం భీం పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తి అని మాజీ శాసనసభ్యుడు మెచ్చా నాగేశ్వరరావు కొనియాడారు. కాత్రం స్వామి, పూనెం వెంకటస్వామి, సోయం వీరభద్రం, మడకం పాపారావు, సున్నం నాగేశ్వరరావు, ఆరెం ప్రశాంత్, వీరస్వామి పాల్గొన్నారు.

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీం జయంత్యుత్సవాన్ని రెవెన్యూ కార్యాలయంలో, ములకపాడు సెంటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలదండలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ కుమురం భీం స్ఫూర్తితో ఆదివాసీ చట్టాల అమలుకు ఉద్యమించాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, గిర్దావర్లు వెంకటేశ్వరరావు, నాయకులు దామోదర్‌రావు, కామరాజు, శ్రీను, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అనేక రంగాల్లో ఉన్న ఆదివాసీలందరూ సంఘాల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని అంబేడ్కర్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన కుమురం భీం జయంతిలో పాయం పాల్గొని మాట్లాడారు. సమాజం కోసం పోరాటాలు చేసి ప్రాణత్యాగం చేసిన ఆదివాసీ నాయకుడు కుమురంభీం ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకుంటూ అందరూ ముందుకు సాగాలన్నారు. అనంతరం కుమురంభీం విగ్రహానికి నివాళి అర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పీర్నాకి నవీన్, నాయకులు తిరుమలేష్, నాగేశ్వరరావు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటలో కుమురం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

★ స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కుమురంభీం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కుమురంభీం విగ్రహానికి నివాళులర్పించారు. పలు ఆదివాసీ, తుడుందెబ్బ సంఘాల నాయకులు కుమురంభీం విగ్రహానికి నివాళి అర్పించారు.

చెక్‌డ్యాంలు ధ్వంసం.. మరమ్మతులపై నిర్లక్ష్యం

కరకగూడెం, న్యూస్‌టుడే


కరకగూడెం మండలంలోని వీరాపురం, గాంధీనగర్ గ్రామ సమీపంలో నిర్మించిన చెక్‌డ్యాం అధిక వర్షాలు, వరద ప్రవాహం కారణంగా ధ్వంసమైంది. తాటిగూడెం పంచాయతీ గాంధీనగర్ గ్రామానికి సమీపంలోని మొట్ల వర్రెపై 2018లో సుమారు రూ.12 లక్షల అంచనా వ్యయంతో చెక్‌డ్యాంను నిర్మించారు. ఫలితంగా 100 ఎకరాలకుపైగా సాగు నీరు అందడంతో రైతులు రెండు పంటలు పండించుకుంటున్నారు. ఇటీవలి వర్షాలకు ఈ చెక్‌డ్యాం ధ్వంసం కావడంతో పొట్టదశలో ఉన్న వరి పంటకు సాగునీరు అందడం లేదు.



వీరాపురంలో ఇసుక బస్తాలతో రైతులు నిర్మించిన అడ్డుకట్ట

★ వీరాపురం సమీపంలోని రాళ్ల వాగుపై 2016లో సుమారు రూ.70 లక్షల అంచనా వ్యయంతో చెక్‌డ్యాంను నిర్మించారు. ఆయకట్టు 200 ఎకరాలు. గత ఏడాది అధిక వర్షాల కారణంగా ఈ చెక్‌డ్యాం కూడా ధ్వంసమైంది. సమస్యపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని పరిస్థితి. దీంతో వీరాపురం రైతులంతా కలిసి ధ్వంసమైన చెక్‌డ్యాంకు ఆనుకొని ఇసుక బస్తాలతో అడ్డుకట్ట నిర్మించారు. అయినా నీటి నిల్వకు ఫలితం లేకుండాపోయిందని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వారు కోరుతున్నారు.

నూతన చెక్‌డ్యాంను నిర్మించాలి



మొట్ల వర్రెపై చెక్ డ్యాంను నిర్మించడం వలన ఆ నీటిని పంటపొలాలకు మళ్లించవచ్చని అన్నారు. దీనివలన పంట పొలాలకు సక్రమంగా సాగు నీరు అంది రెండు పంటలు పండే అవకాశం ఉందని తెలిపారు. – గాందర్ల ముత్తయ్య రైతు, తాటిగూడెం

మరమ్మతులు చేపట్టాలి



ధ్వంసమైన చెక్ డ్యాంకు మరమ్మతులు చేపట్టడం వలన ఆయకట్టు రైతులకు 200 ఎకరాల పైబడి పంట సాగు జరుగుతుందని, దీనివలన నీటి ఎద్దడి లేకుండా రెండు పంటలకు నీరు అందుతుందని తెలిపారు. - బిజ్జ స్వామి రైతు, వీరాపురం

ఎండాకాలంలోపు పనులు పూర్తి

మండలంలోని ధ్వంసమైన చెక్‌డ్యాంల వివరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని, వాటిని ఎండాకాలంలోపు మరమ్మతు పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

- సక్రు, ఏఈ

విద్యార్థుల దూకుడు..



మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ఎస్ఏ-1 పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్ష పూర్తయిన విద్యార్థులు బయటకు వెళ్లకుండా ప్రతిరోజూ పాఠశాల ప్రధాన గేటును మూసివేస్తున్నారు. దీంతో మధ్యాహ్నం భోజనానికి ఇంటికివెళ్లి మళ్లీ పాఠశాలకు వచ్చిన విద్యార్థులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. పరీక్ష పూర్తయిన కొందరు విద్యార్థులు ఉపాధ్యాయుల కళ్లుగప్పి గోడలు దూకుతూ బయటకు వెళ్లి కాలక్షేపంచేసి మళ్లీ పాఠశాలకు వస్తున్నారు. మంగళవారం మధ్యాహ్న భోజనానికి వెళ్లిన కొందరు విద్యార్థులు ఇలా పాఠశాల గేటు దూకి పాఠశాలలోకి ప్రవేశించారు. ఇది చూసిన స్థానికులు ప్రమాదం ఏమైనా జరిగితే బాధ్యులెవరంటూ ప్రశ్నిస్తున్నారు.

కొత్తగూడెం

•కొత్తగూడెం •ఇల్లెందు

గురుకులంలో ఎస్.ఆర్.శంకరన్ జయంతి

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకులంలో గురుకుల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఆర్.శంకరన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిని వీరయ్య హాజరై శంకరన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ముందు చూపుతో ఎందరో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలంటే అది కేవలం గురుకులాల ద్వారానే సాధ్యమవుతుందని గుర్తించి గురుకులాల స్థాపనకు పునాది వేశారని గుర్తు చేశారు. అనంతరం స్వేరోస్ భద్రాద్రి జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడుడిగా రవీందర్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ పీవీఎస్ పాపారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

కొత్తగూడెం సింగరేణి: నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు రూ.16.70కోట్ల నిధులు మంజూరైనట్లు శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. పెనుబల్లి వంతెన నిర్మాణానికి రూ.6.50 కోట్లు, సోములగూడెం బూడిదవాగుపై వంతెన నిర్మాణానికి రూ.4కోట్లు, బేతంపూడి రోడ్డు, వంతెన నిర్మాణానికి రూ2.50కోట్లు, పలు ప్రాంతాల్లో రోడ్లు, వంతెనల నిర్మాణానికి మరో రూ.6.70కోట్లు మంజూరయ్యాయని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689



సమస్య: పాల్వంచ పట్టణం టీచర్స్‌కాలనీలోని మురుగు కాలువలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. - శ్రీనివాస్, స్థానికుడు

సమాధానం: ఏరియా జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం. - కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి - పాల్వంచ, న్యూస్‌టుడే

'జూనో'ను అభినందించిన ఎస్పీ

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీల్లో బంగారు పతకం సాధించిన పోలీస్ జాగిలం 'జూనో'ను ఎస్పీ బి.రోహిత్‌రాజు అభినందించారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు పోలీస్ డ్యూటీ మీట్-2024 పోటీలు రాష్ట్ర పోలీసు అకాడమీ (హైదరాబాద్)లో జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 21 పోలీస్ జాగిలాలు పాల్గొన్నాయి. అందులో జూనో ఎక్స్‌ప్లోజివ్స్ (పేలుడు పదార్థాలను కనిపెట్టే) విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకాన్ని సాధించింది. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో జూనోను సత్కరించి అభినందించారు. పతకాన్ని సాధించిన జూనోకు రివార్డు సైతం అందచేశారు.



పోలీస్ జాగిలం జూనోను సత్కరిస్తున్న ఎస్పీ బి.రోహిత్‌రాజు

ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, ఆర్ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హత కలిగిన ఆర్టిజన్లను పరిగణనలోకి తీసుకోండి



సీఈ ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచ, న్యూస్‌టుడే: డిగ్రీ అర్హత కలిగిన ఆర్టిజన్లను పరిగణనలోకి తీసుకుని పదోన్నతులు కల్పించాలని కేటీపీఎస్ ఐదు, ఆరు దశల సీఈ మేక ప్రభాకర్ రావుకు సంఘం రాష్ట్ర నాయకుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. టీఎస్ జెన్‌కో జారీ చేసిన జీఓ ఆధారంగా డిగ్రీ అర్హత కలిగిన వారికి అవకాశం కల్పించాలని కోరారు.

రూ.లక్షల ఖర్చు.. నిర్వహణ అంతంతే!

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

పురపాలికలో ఆదాయం పెంచుకోవాలనే లక్ష్యంతో రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వర్మి కంపోస్టు కేంద్రాలు ఆశించిన మేర ఫలితం ఇవ్వడం లేదు. కేవలం హరితహారం మొక్కలు పెంచేందుకు, పార్కుల్లో మాత్రమే వినియోగించేందుకే వర్మికంపోస్టు తయారు కేంద్రం కొనసాగుతుండటం గమనార్హం. పాతకొత్తగూడెం మూడో వార్డులో నిర్మించిన వర్మి కంపోస్టు కేంద్రంలో దాదాపు చాలా బెడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తడి, పొడి చెత్త ద్వారా కంపోస్టును తయారు చేసేందుకు అవసరమైన చెత్త సేకరణ సైతం జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఒకవేళ చెత్త సేకరణ జరిగినా వేరు చేసే ప్రక్రియ సవ్యంగా సాగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కేంద్రం వద్ద చెత్త కుప్పలు గుట్టల్లా పేరుకుపోతున్నాయి. దాదాపు 20 బెడ్ల వరకు కంపోస్టు తయారీకి నిర్మించినప్పటికీ పదింట్లో కూడా ఎరువులు తయారయ్యే పరిస్థితులు కన్పించడం లేదు.



వర్మికంపోస్టు యూనిట్ కేంద్రం

ఆదాయం వట్టి మాటే..

పురపాలకంలో ఆదాయ వనరుల సేకరణ ప్రక్రియకు పాలకవర్గం, అధికారులు సంయుక్తంగా మంగళం పాడేస్తున్నారు. పేరుకు మాత్రం రూ.లక్షలతో భవనాలు నిర్మించి నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. రోజూ పట్టణంలో 30 నుంచి 40 మెట్రిక్ టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసేందుకు సిబ్బందిని కేటాయించాల్సి ఉంది. వాటి ద్వారా వర్మి కంపోస్టును తయారు చేసి నర్సరీలకు సైతం విక్రయించే అవకాశాలున్నాయి. పురపాలకంలోని కార్యక్రమాలకే సరిపోతుందంటూ అధికారులు చెప్పుకొస్తుండటం కొసమెరుపు. వర్మి కంపోస్టు ప్రక్రియను మరింత ముమ్మరం చేసేందుకు పురపాలకంలో అధికారులు చర్యలు చేపడుతున్నారని, త్వరలోనే ఎరువుల విషయంలో ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్రాచారి తెలిపారు.

బంగారం చోరీ చేసిన నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్, చిత్రంలో సీఐలు వెంకటేశ్వర్లు, రమాకాంత్, ఎస్సైలు రవి, ప్రవీణ్, రామారావు

చుంచుపల్లి, న్యూస్‌టుడే: ఈ నెల 9న విద్యానగర్‌లో బంగారు ఆభరణాలు చోరీ చేసిన నిందితులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని విచారించారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్ మంగళవారం చుంచుపల్లి ఠాణాలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి పంచాయతీ మోలాగూడెనికి చెందిన ఆటోడ్రైవర్ తంజాల నితిన్(26), అదే మండలం లోతువాగుకు చెందిన గుంజా వీరబాబు(37), ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురానికి చెందిన నిమ్మల విజయ్‌కుమార్(20), కొత్తగూడెం హనుమాన్ బస్తీకి చెందిన డ్రైవర్ మహ్మద్ నయాం(32)లు స్నేహితులు. నితిన్ తన ఆటోను నడుపుకొంటూ విజయ్ కుమార్, వీరబాబులను ఎక్కించుకుని ఈ నెల 9న కొత్తగూడెం పోస్టాఫీస్ ఎస్‌బీఐ వద్ద నిలిపి కొంత సేపు వేచి ఉన్నారు. ఆ సమయంలోనే కొత్తగూడెం రైటర్ బస్తీకి చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగి బోడపాటి వెంకటేశ్వరరావు తన లాకర్ నుంచి 19 తులాల బంగారు ఆభరణాలను డ్రా చేసుకొచ్చి వారి ఆటోపై గమనించి ఆయనపై నిఘా పెట్టారు. విద్యానగర్‌లోని ఓ సూపర్ మార్కెట్లో కొనుగోలు చేసిన సరుకులను తన కారు వద్దకు తీసుకెళ్తుండగా నితిన్ కారులో ఉన్న బంగారు ఆభరణాల బ్యాగ్‌ను దొంగిలించారు. వీరికి హనుమాన్‌బస్తీలో డ్రైవర్ మహ్మద్ నయాం ఆశ్రయం కల్పించారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 33 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.27,400 నగదు, మూడు చరవాణులు, నంబరు ప్లేట్ లేని ఆటో, సోపానెట్ స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నితిన్‌పై ఇప్పటికే పలు ప్రాంతాల్లో చోరీ కేసులు ఉన్నాయని చెప్పారు. నిందితులను పట్టుకున్న సీసీఎస్ సీఐ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్సై రవి కుమార్ సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేకంగా అభినందించారని పేర్కొన్నారు. వారికి రివార్డు ప్రకటించనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం కార్పొరేట్, కొత్తగూడెం ఏరియా పరిధిలో నిర్వహించనున్నారు. వైద్యుడు విశ్వనాథ మహర్షి పలు దీర్ఘకాలిక రోగాలకు ఉచితంగా వైద్యంతో పాటు మందులు అందించనున్నారు. ఏరియాలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం వరకు రుద్రంపూర్ సేవాసెంటర్‌లో, మధ్యాహ్నం 3 నుంచి కార్పొరేట్ ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో అందుబాటులో ఉండనున్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ పురపాలికలో స్వచ్ఛ కార్మికులకు వేతనాలు చెల్లించాలని టీసీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేష్ డిమాండ్ చేశారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు పురపాలిక నుంచి వేతనాలు చెల్లించాలని నిరసన దీక్షను మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఇప్పటికే తమకు న్యాయం చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యే వద్దకు వెళ్లినప్పటికీ న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్‌కుమార్, పొనిశెట్టి వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, గట్టల రమేష్, కార్మికులు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో కార్మికులు, నాయకులు

28 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరిక

టేకులపల్లి, న్యూస్‌టుడే: కేటీసీ టిప్పర్ కార్మికుల వేతనాలను పెంచాలని, లేనియెడల ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మె తప్పదని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలి హెచ్చరించారు. సమ్మెలో ఉన్న మోటార్ కార్మికుల పక్షాన టీయూసీఐ నేతలు టిప్పర్ అసోసియేషన్‌తో మంగళవారం చర్చలు జరిపారు. వేతనాల విషయమై ఈనెల 28న తిరిగి చర్చలు నిర్వహిద్దామని టిప్పర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కోరం సురేందర్, టిప్పర్ యూనియన్ అధ్యక్షుడు నేలవెల్లి నరసింహారావు, కోల్‌ట్రాన్స్‌పోర్టు అధ్యక్షుడు వరద రామచంద్రయ్యలు నేతలకు హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారు. పాయం వెంకన్న, సుందర్, మదార్, చింటు, రాజేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలి

మునగ సాగుపై రైతులకు అవగాహన

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: వెదురు, మునగ పంటల సాగుపై కొమరారం రైతు వేదికలో రైతులకు అవగాహన సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఏడీఏ లాల్ చంద్ మాట్లాడుతూ.. చిన్న, సన్న కారు రైతులకు వెదురు, మునగసాగు వరమని తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలు నాటడం, ఎరువుల సరఫరాలో రాయితీ లభిస్తుందని చెప్పారు. ఎంపీడీవో ధన్‌సింగ్, ఏవో సతీశ్, ఏపీవో చిరంజీవి పాల్గొన్నారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే: జాబ్‌కార్డు కలిగి ఉన్న సన్నకారు రైతులు మునగ సాగు చేపడితే ఎకరాకు రూ.లక్ష ఈజీఎస్ ద్వారా పెట్టుబడి ఖర్చులకు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీఓ రవీందర్‌రావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో వెయ్యి ఎకరాల్లో మునగ, వెదురు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, ఇప్పటి వరకు 43 ఎకరాల్లో మునగసాగు చేపట్టినట్లు వివరించారు. రైతులు గమనించి మునగ సాగుపై దృష్టి సారించాలని కోరారు.

అయోడిన్ లోపాన్ని అధిగమిద్దాం

టేకులపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణం అయోడిన్ లోపం అని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేశ్ అన్నారు. స్థానిక జ్యోతిరావుపులే గురుకుల పాఠశాలలో మంగళవారం అయోడిన్ లోప రుగ్మతలపై అవగాహన కల్పించారు. అయోడైజ్డ్ ఉప్పును వాడటం ద్వారా, అయోడిన్ లభ్యమయ్యే ఆహార పదార్థాలైన సముద్రపు చేపలు, రొయ్యలు, గుడ్లు, పాలు, పన్నీరు, పెరుగు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్, హెచ్‌ఈఓ దేవా పాల్గొన్నారు.


కేఓసీ ఓబీ యాజమాన్యంతో చర్చలు సఫలం

టేకులపల్లి, న్యూస్‌టుడే: కేఓసీ ఓబీ యాజమాన్యంతో కేఓసీ ఓబీ క్యాంపులో మంగళవారం ఐఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు కోరం సురేందర్ సారథ్యంలో ఎల్ఎస్ఎన్ ఓబీ జీఎం శివ, పీఎం రాజమోహన్‌రెడ్డితో జరిపిన చర్చలు సఫలమైనట్లు ఐఎన్‌టీయూసీ కేఓసీ యూనియన్ ప్రెసిడెంట్ ముచ్చా సుధాకర్ తెలిపారు. కార్మికుల జీతాల పెంపు, చెల్లించాల్సిన బోనస్‌ను వీలైనంత త్వరగా వారి ఖాతాల్లో జమ చేస్తామని, దీపావళి పండగకు ప్రతి కార్మికుడికి రూ.5వేలు అడ్వాన్స్, వొల్వో డ్రైవర్ల మాదిరిగానే ట్యాంకర్ డ్రైవర్లకు కూడా సమానంగా వేతనాలు, ప్రతి రెండు నెలలకు కార్మికుల పీఎఫ్ వారి ఖాతాల్లో జమ తదితర సమస్యలపై చర్చించగా ఓబీ యాజమాన్యం అంగీకరించిందని సుధాకర్ తెలిపారు. కార్మికులకు రెండు జతల దుస్తుల పంపిణీపై ఎండీతో చర్చించాల్సి ఉందని, చర్చకు వచ్చిన కార్మికుల వేతనాలు, బోనస్‌లు, పీఎఫ్ వంటి సమస్యల పరిష్కారానికి ఓబీ యాజమాన్యం సహకరిస్తుందని ఎల్ఎస్ఎన్ ఓబీ జీఎం శివ తెలిపారు. చొరవ చూపిన ఐఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు కోరం సురేందర్, ఎల్ఎస్ఎన్ మినిరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నితిన్ జోసెఫ్‌కు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.



కేఓసీలో ఓబీ యాజమాన్యంతో చర్చిస్తున్న నాయకులు

పరికరాలు శిథిలం.. పర్యాటకులకు భయం..!



పర్యాటక ప్రాంతాల్లో పిల్లల చూపు పార్కుపై ఉంటోంది. రయిన ఉరికి జారుడుబల్లపై జర్రున జారుతారు.. ఊయ్యాలపై ఊగుతూ చిరునవ్వులు చిందిస్తుంటే తల్లిదండ్రులు ఆనందంతో ఉప్పొంగిపోతారు. కిన్నెరసాని రిజర్వాయర్‌లోని పార్కులో పిల్లలు ఆడేత మాత్రం కుటుంబీకులు కంటతడి పెట్టాల్సిందే. నిచ్చెన, జారుడుబల్ల, సీసా, ఇనుప వస్తువులు శిథిలమై విరిగి దర్శనమిస్తుండటంతో పర్యాటకులు భయాందోళనకు గురవుతున్నారు. ఎఫ్‌బీవో రాములును వివరణ కోరగా.. కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపట్టి పార్కు పునర్నిర్మిస్తామని తెలిపారు. – పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

గోదావరి జలాలు అందించాలని వినతి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: గోదావరి నది జలాలను సీతారామ ప్రాజెక్టు ద్వారా ఏజెన్సీ ప్రాంతాలకు అందించాలని గోదావరి జలాల సాధన కమిటీ ఇల్లెందు నియోజకవర్గం తరఫున వెళ్లిన పలు పార్టీల బృందం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతం ఇల్లెందు నియోజకవర్గానికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని, ఇల్లెందు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పాటు కొమరారం, బోడు నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరారు. ఏపూరి బ్రహ్మం, ఆలేటి కిరణ్, బంధం నాగయ్య, రాంసింగ్, మోహన్‌రావు, క్లింట్‌రోచ్, బుర్రవెంకన్న పాల్గొన్నారు.



ఉప ముఖ్యమంత్రి భట్టికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి, నాయకులు

గత ప్రభుత్వం అప్పులే మిగిల్చింది: ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

జూలూరుపాడు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంలో రూ.7 లక్షల కోట్ల అప్పులు మిగిలాయని, దీంతో కనీసం ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వని పరిస్థితుల్లో నుంచి రాష్ట్రాన్ని బయట పడేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. జూలూరుపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. రైతు భరోసా యాసంగి నుంచి అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి సమీకృత గురుకుల పాఠశాల మంజూరైందని, దీనికి స్థల సేకరణ చేయాల్సి ఉందన్నారు. అలాగే వ్యవసాయ పాలిటెక్నిక్ డిప్లమా కళాశాల ఏర్పాటుకు స్థలం ఉంటే ఏర్పాటు చేస్తామన్నారు. కాకర్లలో విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు చేసినట్లు చెప్పారు. సీతారామ ప్రాజెక్టు నుంచి జూలూరుపాడు, ఏన్కూరు మండలాలకు గోదావరి జలాలను అందించేందుకు పంట కాలువల నిర్మాణం కోసం త్వరలోనే టెంటర్లు పిలవనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలని, బేతాళపాడు పరిసర గ్రామాల రైతులకు ఉపయోగకరంగా ఉండే డొంక రోడ్డుకు గ్రావెల్ తోలించాలని, జూలూరుపాడులో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతిబిందు, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ తాళ్లూరి రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మంగీలాల్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

నిబద్ధతతో విధులు నిర్వహించండి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాలకు మంచినీటి సరఫరా చేయడంలో ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. ఇల్లెందు కోరగుట్ట మిషన్ భగీరథ కార్యాలయంలో మూడురోజుల శిక్షణ పూర్తి చేసుకున్న గ్రామ మంచినీటి సహాయకులకు ఎమ్మెల్యేతో పాటు మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ తిరుమలేశ్, డీఈ మురళీకృష్ణ, ఏఈఈ బాలాజీ ధ్రువపత్రాలు అందజేశారు.



ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, అధికారులు

వేతనాలు సకాలంలో చెల్లించడం లేదని వినతి

టేకులపల్లి: కోయగూడెం ఓసీలో మట్టితీత పనులు నిర్వహిస్తున్న ఓబీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని టేకులపల్లి రాజకీయ ఐకాస ఛైర్మన్ లక్కినేని సురేందర్‌రావు కోరారు. మంగళవారం కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వేతనాలు సకాలంలో చెల్లించడం లేదని, కార్మికులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రసాద్, వీరబ్రహ్మాచారి, శివనాయక్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన జలం అందిద్దాం

టేకులపల్లి, న్యూస్‌టుడే: మిషన్‌భగీరథ, డీపీ సిస్టమ్‌ల ద్వారా స్వచ్ఛమైన జలాన్ని ప్రతి ఇంటికీ అందిద్దామని ఎంపీడీఓ రవీందర్‌రావు, మిషన్‌భగీరథ గ్రిడ్ ఏఈ రమేశ్ మంచినీటి సహాయకులకు సూచించారు. మూడు రోజులుగా చుక్కాలబోడు రైతు వేదికలో జరిగిన మంచినీటి సహాయకుల శిక్షణ మంగళవారం ముగిసింది. హ్యాండ్‌పంప్, బోర్‌వెల్ మరమ్మతులు, పైప్‌లైన్, నల్లా కనెక్షన్ల లీకేజీ, గేట్ వాల్వ్ లీకేజీల గురించి శిక్షణ ఇచ్చారు. అనంతరం మంచినీటి సహాయకులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. భగీరథ ఇంట్రా ఏఈ సుజిత తదితరులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలతో మంచి నీటి సహాయకులు

కొమురం భీం జయంత్యుత్సవాలు

కొత్తగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే: కొమురం భీం జయంతి వేడుకలను మంగళవారం లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లో ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లిలో బహుజనుల ఐకాస ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాజపా రాష్ట్ర నాయకుడు పోడియం బాలరాజు, కాంగ్రెస్ నాయకుడు పూణెం శ్రీను, ఏఈడబ్ల్యూసీపీ నాయకుడు లక్ష్మణ్, దళిత, ముస్లిం బీసీ సంఘాల నాయకులు కృష్ణ, అఫ్సర్ ఖాన్, రాజుగౌడ్ పాల్గొని కొమురం భీం చిత్రపటానికి నివాళులర్పించారు. చుంచుపల్లి మండలంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కోటేశ్వరరావు, లక్ష్మి నర్సు, మోహన్, రమేశ్ పాల్గొన్నారు.



లక్ష్మీదేవిపల్లిలో కొమురం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదివాసీల సంక్షేమమే లక్ష్యంగా పోరాడిన వీరుడు కొమురం భీం గిరిజనుల ఆరాధ్యదైవంగా నిలిచారని భారాస వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ తెలిపారు. కొమురం భీం జయంతి సందర్భంగా ఇల్లెందు పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద మంగళవారం ఆయన విగ్రహానికి పార్టీశ్రేణులతో కలిసి పూలమాలలు వేశారు. సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, బావ్‌సింగ్, ధనలక్ష్మి పాల్గొన్నారు.



ఇల్లెందు గ్రామీణం: కొమురం భీం విగ్రహం వద్ద నాయకులు

పాల్వంచ గ్రామీణం: రాజాపురంలో కొమురం భీం జయంతిని ఘనంగా నిర్వహించారు. మోడల్‌క్రీడల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.రామారావు పాల్గొని నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు రాంప్రసాద్, వాసం చైతన్యకుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్మికులకు బోనస్ ఇవ్వండి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సోలార్ పవర్ ప్లాంట్ కార్మికులకు కూడా సింగరేణిలో పొరుగుసేవల కార్మికులకు ఇచ్చినట్లుగా రూ.5వేలు బోనస్ ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి తాళ్లూరి కృష్ణ డిమాండ్ చేశారు. సోలార్ పవర్‌ప్లాంట్ ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన నిర్వహించారు. సోలార్ పవర్ ప్లాంట్ సీఐటీయూ అధ్యక్షుడు ప్రేమ్ సింగ్, ఉపాధ్యక్షుడు శంకర్, శ్యాం పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

రెస్క్యూ బృందానికి అభినందనలు

కొత్తగూడెం సింగరేణి: ఈ నెల 16, 17తేదీల్లో జరిగిన జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల్లో ప్రథమ బహుమతిని సాధించిన కొత్తగూడెం రీజియన్ జట్టును ఏరియా జీఎం షాలేము రాజు అభినందించారు. మంగళవారం జీఎం కార్యాలయంలో రెస్క్యూ జట్టు షాలేమురాజును మర్యాద పూర్వకంగా కలువగా ఆయన వారిని అభినందించారు. ఏఎస్‌వో వెంకటేశ్వరరావు, రెస్క్యూ ఇన్‌ఛార్జి అనంతరామయ్య, జట్టు సభ్యులు మనోహర్, అనిల్‌రెడ్డి, భానుప్రసాద్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, వరప్రసాద్, రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి: పీఆర్‌టీయూ

జూలూరుపాడు, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. జూలూరుపాడు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అయిదు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీని వెంటనే అమలులోకి తీసుకురావాలన్నారు. అంతకుముందు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచారంలో భాగంగా మండలంలోని ఉపాధ్యాయులను కలిసి పీఆర్‌టీయూ తరపున పోటీ చేసే అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి షకీల, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, ఉపేందర్, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన..

జూలూరుపాడు, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న బిల్లులను, అయిదు డీఏలను వెంటనే విడుదల చేయాలని, నూతన పీఆర్సీని అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోడా కృష్ణ మాట్లాడుతూ ఈ-కుబేర్‌లో ఉన్న వివిధ రకాల మెడికల్, జీపీఎఫ్, సరెండర్ రిటైర్మెంట్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనర్సయ్య, శాంతకుమారి, శ్రీనివాస్, ఉమామహేశ్వరి, ఉమాశకుంతల, వెంకటేశ్వర్లు, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

పిక్కలు పీకుతున్న కుక్కలు..!



ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

ఇల్లెందు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వీధిశునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోజూ ఎక్కడో ఓచోట ఒకరిద్దరిపై దాడికి పాల్పడుతున్నాయి. చికిత్స కోసం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలతో పాటు కొమరారం, రొంపేడు పీహెచ్‌సీలకు బాధితులు వస్తున్నారు. వీటిలో గత మూడు నెలల్లో 400 మందికి పైగా బాధితులు చికిత్స పొందగా మరో 300 మంది ప్రైవేట్ దవాఖానాలను ఆశ్రయించారనే అంచనాలున్నాయి.

గత మూడు నెలల వ్యవధిలో చికిత్స పొందిన కుక్క కాటు బాధితుల వివరాలు

వైద్యశాల	జులై	ఆగస్టు	సెప్టెంబర్
ఇల్లెందు వైద్యశాల	87	120	108
కొమరారం పీహెచ్‌సీ	14	26	44
రొంపేడు పీహెచ్‌సీ	17	14	17



ఇల్లెందు పట్టణంలో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కుక్కలు

ఇల్లెందు పట్టణంలో వీధి కుక్కల బెడద నివారణకు కృషి చేస్తున్నాం. ఇందుకోసం ఇప్పటివరకు రూ.5లక్షల వరకు వెచ్చించాం. గత సంవత్సరం 149 శునకాలకు స్టెరిలైజేషన్ చేయించాం. ఈసారి మరో 270 శునకాలకు స్టెరిలైజేషన్ చేయాలని నిర్ణయించాం.
– యాదగిరి, పుర కమిషనర్, ఇల్లెందు